ప్రజాశక్తి

మంగళవారం 18 జులై 2023



21న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జెసి విడుదల చేశారు. ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో పార్వతీపురంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జాబ్‌మేళాకు 19 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు

బకాయి వేతనాలు చెల్లించాలని

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం పంచాయతీ కార్మికులు (గ్రీన్ అంబాసిడర్లు) ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎన్.వై.నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కార్యదర్శి బి.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 16 నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించే బాధ్యతను పంచాయతీలకు అప్పగించి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకొనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు పనిముట్లు ఇవ్వాలని, చెత్త సేకరణ బండ్ల మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాలకు 10 లక్షలు పరిహారం చెల్లించాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందించారు. కలెక్టర్ స్పందిస్తూ 15 రోజుల్లోగా పంచాయతీలకు నిధులు జమ కానున్నాయని, ఆ నిధుల నుండి మొదటి ప్రాధాన్యతగా కార్మికులకు బకాయి వేతనాన్ని పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మన్యం జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, యూనియన్ నాయకులు వెంకటనాయుడు, గౌరి, పకీరు, పైడయ్య, సుజాత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

20న జంఝావతి నీరు విడుదల

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జంఝావతి ఆయకట్టుకు ఈ నెల 20న సాగునీరు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ వి.అప్పారావు తెలిపారు. ఖరీఫ్‌కు సుమారు 9 వేల ఎకరాలకు సాగునీటిని అందించడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి, సీతానగరం మండలాలకు చెందిన చెరువులు ముందుగా నింపుతామని చెప్పారు. అందుకు అనుగుణంగా ఆర్‌వన్ కాలువలోని పూడికలు, గుర్రపు డెక్క ఉపాధి హామీ పనుల ద్వారా తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

> "క్రీడలకు పెద్దపీట వేస్తాం. ఏజెన్సీలోని మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం. గిరిజన క్రీడాకారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. సకల సదుపాయాలు కల్పించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారు రాణించేలా తోడ్పాటు అందిస్తాం."

ఇవీ ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రసంగాల్లో తరచూ వినిపించే హామీలు. ఏదో క్రీడా పోటీల ప్రారంభ సభలో, బహుమతుల ప్రదానోత్సవంలో ఆ హామీలివ్వడం ఆనవాయితీగా వస్తోంది. అంతే తప్ప కార్యరూపం దాల్చడమన్న ప్రశ్నే లేదు. అందుకు నిదర్శనమే సీతంపేట క్రీడా పాఠశాలపై శీతకన్ను వేయడాన్ని చెప్పొచ్చు. వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రయివేటు స్పోర్ట్స్ స్కూళ్లలో చేరుతున్న ప్రస్తుత తరుణంలో, ఉచితంగా, అందుబాటులో క్రీడా పాఠశాల ఉన్నా ప్రవేశాలకు విద్యార్థులు వెనక్కి జంకుతున్నారంటే అక్కడ సదుపాయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.



క్రీడా పాఠశాల నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల ఇదే

క్రీడా పాఠశాలపై శీతకన్ను

- గిరిజన క్రీడాకారులపై అశ్రద్ధ
- అసౌకర్యాల నడుమ నిర్వహణ
- ఆసక్తి చూపని విద్యార్థులు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన విద్యార్థులు విద్యతోపాటు ఆట, పాటలు, క్రీడలపై మొగ్గు చూపుతారని, వారి నైపుణ్యం వెలికి తీయడానికి 2021లో సీతంపేటకు క్రీడా పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అంతవరకు బాగానే ఉంది. కానీ ఎటువంటి నిధులు, పరికరాలు మంజూరు చేయలేదు. దీంతో విద్యార్థులు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఆసక్తి చూపడం లేదు. 2021-22 విద్యా సంవత్సరంలో సీతంపేటకు క్రీడా పాఠశాల మంజూరు చేసి, ఐటిడిఎ సమీపంలో ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో ఆదరాబాదరాగా అప్పటి గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ చినవీరభద్రుడు ప్రారంభించారు. అప్పటినుండి ఇప్పటివరకు 32 విద్యార్థులు మాత్రమే ప్రవేశించారు.

వసతులు కరువు

క్రీడా పాఠశాలకు ప్రత్యేకమైన వసతులుండాలి. కానీ, సీతంపేట బాలుర గురుకుల భవనంలోనే క్రీడా పాఠశాల నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. దాంతోపాటు క్రీడా పాఠశాలకు విద్యార్థులకు సంబంధించి జావెలిన్‌త్రో, ఫుట్‌బాల్, తదితర క్రీడా పరికరాలు సరఫరా చేయాలి. క్రీడా యూనిఫాం ఉండాలి. ఇవేవీ ఇంతవరకు మంజూరు చేయలేదు. వీరికి ప్రత్యేకమైన భోజనం.. రోజుకు 125 రూపాయలు విలువ చేసే ఆహారం అందించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గురుకుల విద్యార్థులకు అందించే ఆహారాన్నే అందిస్తున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం కోసం 46 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. క్రీడాపాఠశాలకు కోచ్‌లు ఐదుగురు ఉండాల్సి ఉన్నప్పటికీ ముగ్గురు ఉన్నారు. క్రీడా పాఠశాలలో ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు పాఠశాల ఉంటుంది. గురుకుల ఉపాధ్యాయులతోనే దీనిని నెట్టుకొస్తున్నారు. సీతంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు తాజాగా సోమవారం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు జోనల్ స్కూల్‌గా సీతంపేట ఉండటంతో శ్రీకాకుళం విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి విద్యార్థులు హాజరుకావచ్చు. కానీ 88 సీట్లకు 75 మంది మాత్రమే వచ్చారు. అందులో సీతంపేట గురుకుల పాఠశాల నుంచి 73 మంది హాజరయ్యారు. గుమ్మలక్ష్మీపురం నుంచి ఒకరు, శ్రీకాకుళం జిల్లా పెద్దమడి పాఠశాల నుంచి ఒకరు హాజరుకాగా, విజయనగరం జిల్లా పూర్తిగా విద్యార్థులు హాజరుకాలేదు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో వారిని చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు.

ప్రిన్సిపల్ వివరణ

ఈ విషయాన్ని క్రీడా పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతిరాజు వద్ద ప్రస్తావించగా, ప్రస్తుతం క్రీడా పరికరాలు రాలేదని చెప్పారు. గురుకులం మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నామని సమాధానం ఇచ్చారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

సీతంపేట : మండలంలో ఐటిడిఎ సమీపంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం గురుకులాల నోడల్ కన్వీనర్ పి.నాగభూషణం ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జోనల్‌కు సంబంధించి 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.తిరుపతిరాజు, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ పాల్గొన్నారు.



ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్న నోడల్ కన్వీనర్

వినతులకు సత్వర పరిష్కారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జల్లేపల్లి వెంకటరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అధికంగా వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతులను అందజేశారు. వాటిలో కొన్ని...

కురుపాం మండలం నేరేడువలస గ్రామంలో ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని, దీనిని ప్రభుత్వ పాఠశాలగా మార్చాలని, లేకుంటే టీచర్లను అయినా నియమించాలని బిడ్డిక బుల్లయ్య, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.

సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామం మారయ్యపాడుకు రహదారి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, తాడిలోవ నుంచి మారయ్యపాడు వరకు తారురోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ రామ్మూర్తి, గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

పార్వతీపురం మండలం విశ్వంబరపురం గ్రామానికి చెందిన బి.భాస్కరరావు.. సర్వే నంబర్ 230, 229లో ఉన్న ప్రభుత్వ భూమి 30 సంవత్సరాలుగా తన సాగులో ఉందని, డి-పట్టా మంజూరు చేయాలని కోరారు. నర్సిపురం గ్రామ రైతులు విశ్వంభరపురం పంచాయతీలో తమ తల్లిదండ్రుల పేర్లతో డి-పట్టా భూములు ఉన్నాయని, వారు మరణించి నందున ఆ భూములను తమ పేరిట మార్చాలని అర్జీ అందజేశారు. కొత్తవలస రైతులు 25 ఏళ్లుగా తాము చేస్తున్న బంజరు భూములకు డిపట్టాలు మంజూరు చేయాలని కోరారు.

గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామానికి చెందిన గంటా రాములమ్మ తనకు కొత్త రేషన్ కార్డు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని ఫిర్యాదు చేశారు.

ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా సప్లయి అధికారి సూర్యారావు, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ నిశాంత్‌కు సమస్యను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సెంటర్ డివైడర్ నిర్మించాలని వినతి

బెలగాం నుండి వైకెఎం కాలనీ వరకు మెయిన్ రోడ్డులో సెంటర్ డివైడర్‌ను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జనసేన జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్.. కలెక్టర్‌కు వినతి అందించారు. రోడ్డుకు ఇరువైపులా కొంతమంది వ్యాపారులు ఆక్రమణలకు పాల్పడటంతో రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలకు మరింత కారణమవుతోందని వివరించారు. వెంకంపేట గోలీల వద్ద జరిగిన ఆక్రమణలు తొలగించాలని కోరారు.

ఎపిడి సత్యంనాయుడుపై దర్యాప్తు చేపట్టాలి

ఐటిడిఎలో వైకెపి ఎపిడి వై.సత్యంనాయుడు పనిచేసిన మూడేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు చేయాలని సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన స్పందనలో జెసి గోవిందరావుకు వినతి అందించారు. సుమారు రూ.2 కోట్ల నిధులు ఏమయ్యాయని తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వీటిపై దర్యాప్తు చేసి, గిరిజనులకు న్యాయాలని చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం జిల్లా నాయకులు హెచ్.రామారావు కోరారు.

నిత్యావసరాల ధరలను అదుపు చేయాలని సిపిఎం వినతి

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలను అదుపుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యాన స్పందనలో కలెక్టర్‌కు వినతి అందించారు. ధరలను అదుపు చేయటానికి అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపార సంస్థలతో ఫుడ్ కమిటీలు, విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతు బజారు, చౌక ధరల డిపోల ద్వారా కూరగాయలు, నిత్యావసరాలు సబ్సిడీ ధరలకే ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వి.ఇందిర, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.



గాయత్రి చిల్డ్రన్ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-పాలకొండ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు అన్నారు. పాలకొండ పట్టణంలో గాయత్రి చిల్డ్రన్ క్లినిక్, పిఎంఆర్ డయాగ్నోస్టిక్స్ కేంద్రాన్ని డిఎంహెచ్ఒ సోమవారం తనిఖీ చేశారు. చిన్న పిల్లల్లో వస్తున్న వ్యాధులు, వాటి నమోదు వివరాలను చిల్డ్రన్ క్లినిక్‌లో పరిశీలించారు. ఇటీవల కాలంలో నమోదు అవుతున్న, గుర్తించిన వ్యాధుల వివరాలను డయాగ్నస్టిక్స్ కేంద్రంలో తనిఖీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్, డయాగ్నోస్టిక్స్ కేంద్రాల్లో నమోదు అవుతున్న, గుర్తించిన వ్యాధుల వివరాలను రికార్డు చేయాలని, వాటిని డిఎంహెచ్ఒ కార్యాలయానికి విధిగా సమర్పించాలని ఆయన ఆదేశించారు. నోటిఫైడ్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చిల్డ్రన్ క్లినిక్ వైద్యులు రవీంద్ర బాబు, డిఇఎంఒ వై.యోగేశ్వర రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని వాలంటీర్లకు సూచించారు. ఈ నెల 20న జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



నాట్లు వేయడానికి సిద్ధం చేసిన పొలం

ఊపందుకున్న ఉబాలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సీజన్ పొలం పనులు ఊపందుకున్నాయి. లక్ష్మీపురం, గుడ్డిపేట, బూర్జ, చల్లమనాయుడువలస తదితర గ్రామాల్లో వరినారుడులు సిద్ధం కావడంతో వర్షం పడటంతోపాటు విద్యుత్తు మోటార్లు ఉన్న చోట్ల దమ్ములు పడుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని గిరిజన గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు కోరారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో మలేరియా, డెంగీ వ్యాధులతో గిరిజనులు బాధపడడం కనిపిస్తుందని చెప్పారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అనారోగ్యం బారిన పడి పెద్ద సంఖ్యలో వైద్యం కోసం వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రులలో బెడ్ల సంఖ్య పెంచాలని, గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు.

'రహదారి ఏర్పాటు చేస్తాం'

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-మక్కువ


మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీలో జగనన్న కాలనీకి రహదారి ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ సూర్యనారాయణ తెలిపారు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'జగనన్న కాలనీకి దారేది' కథనానికి డిప్యూటీ సిఎం రాజన్నదొర స్పందించి జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లేఔట్‌ను పరిశీలిస్తామని తెలిపారు. కాలనీ లేఔట్ కోసం కొనుగోలు చేసేటప్పుడు ముందే గుర్తించాల్సి ఉందని, అలా ఎందుకు చేయలేదో తనకు తెలియదని చెప్పారు. భూమిని సర్వే చేసి, జిరాయితీ భూమి ఉన్న యజమానిని ఒప్పించి రహదారి ఏర్పాటు చేస్తామన్నారు.

భంజ్‌దేవ్ భ్రష్టుపట్టించారు!

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు తెలుగు తమ్ముళ్ల లేఖ • సోషల్ మీడియాలో కలకలం

ప్రజాశక్తి-సాలూరు

మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్ నియోజకవర్గంలో టిడిపిని భ్రష్టుపట్టించారంటూ పలువురు మండల నాయకులు అధినేత చంద్రబాబునాయుడుకు రాసిన లేఖ తెలుగు తమ్ముళ్లలో కలకలం రేపుతోంది. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భంజ్‌దేవ్ నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు నడుపుతూ పార్టీ ఎదగకుండా చేశారని ఆరోపించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన నాయకులు సంతకాలు ఆ లేఖలో ఉన్నాయి. టిడిపి మక్కువ మండల ప్రధాన కార్యదర్శి బి.గౌరీశంకరరావు, పాచిపెంట మండల కార్యదర్శి జి.యుగంధర్, అరకు పార్లమెంటు వైద్య విభాగం అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు, జిల్లా అధికారప్రతినిధి అక్కేన తిరుపతిరావు, పాచిపెంట ఎంపిటిసి సభ్యులు పి.ఉమామహేశ్వరరావు, తెలుగు యువత పాచిపెంట మండల అధ్యక్షులు సిహెచ్.కనకారావు, మాజీ కౌన్సిలర్ డి.కృష్ణ, పట్టణ నాయకులు బి.సతీష్‌తోపాటు మరికొందరు కార్యకర్తల సంతకాలతో పార్టీ అధినేతకు లేఖ రాశారు. ఈ లేఖ ఇప్పుడు టిడిపి సోషల్ మీడియా గ్రూపుల్లో కలకలం రేపుతోంది. తాను తప్ప మరెవరూ నియోజకవర్గంలో ఆధిపత్యం వహించ కూడదని భావిస్తున్నారని, మండలాల్లో గ్రూపులను విడగొట్టారని పేర్కొన్నారు. 2009 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సంధ్యారాణిని ఓడించేందుకు అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావుతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. భారీ మెజారిటీతో గెలవాల్సిన టిడిపి.. భంజ్‌దేవ్ వెన్నుపోటు కారణంగా 1500ఓట్ల తేడాతో ఓటమి పాలైందని పేర్కొన్నారు. 2014 ఎన్నికల ముందు దొడ్డిదారిన ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం సంపాదించి టిడిపి అభ్యర్థిగా భంజ్‌దేవ్ పోటీ చేశారని, ఆ ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన నిధులను సొంత అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో కూడా టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన భంజ్‌దేవ్ పార్టీ ఇచ్చిన నిధులు మిగిలించుకుని ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. పారమ్మకొండ భూముల్లో చేపల చెరువులు నిర్మించుకున్న భంజ్‌దేవ్ ఆ భూములను కాపాడుకునేందుకు మంత్రి బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావుతో కుమ్మక్కు రాజకీయాలు నడుపుతున్నారని లేఖలో ఘాటుగా ఆరోపణలు గుప్పించారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలలో ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది.



చంద్రబాబుకు టిడిపి సాలూరు నియోజకవర్గ నాయకులు రాసిన లేఖ

నాడు-నేడు.. పూర్తయ్యేదెప్పుడు?

ముందుకు సాగని పనులు • అసౌకర్యాల నడుమ విద్యా బోధన • వీరఘట్టం మండలంలో నాడు- నేడు పనుల పరిస్థితి

ప్రజాశక్తి-వీరఘట్టం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు బడులో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు కల్పిస్తామంటున్న ప్రభుత్వం ఆర్భాటం ప్రచారాలకే పరిమితమవుతోంది. ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. ఈ కారణంగా విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యాబోధన కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరిపడా ఉపాధ్యాయులున్నా భవనాల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మండలంలోని 2020- 21 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత కింద రూ.7.24 కోట్లతో 31 పాఠశాలల్లో నాడు- నేడు పనులు చేపట్టారు. రెండో విడతలో రూ.10.44 కోట్లతో 30 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. వీటికి సంబంధించి రూ.3.46 కోట్లు


చిట్టిపూడివలసలో గ్రామస్తులు నిర్మించిన రేకుల షెడ్డు


కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునాదులకే పరిమితమైన భవనం,


వీరఘట్టం బిసి కాలనీ పాఠశాలలో కిక్కిరిసిన విద్యార్థులు

ఆయా ఖాతాల్లో జమయ్యాయని, ఇంతవరకు రూ.2.48 కోట్లు ఖర్చయినట్లు విద్యాశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెగ్యులర్ పాఠశాల, కోమటి వీధి ,కూరాకుల వీధి పాఠశాలలతోపాటు రేగులపాడులోని కెజిబివి, కంబరవలస, కడకల్లా, తదితర గ్రామ పాఠశాలలో మందకొడిగా నాడు-నేడు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.60 లక్షలతో నాడు-నేడు పనులు చేపడుతున్నారు. ఇక్కడ 260 మందికి పైగా విద్యార్థులున్నారు. ఇదే కళాశాలలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించడంతో విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నామని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో కాలకృత్యాలకు విద్యార్థులు బయటకు పరుగులు తీస్తున్నారు. కోమటివీధి పాఠశాలలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ బాలుర వసతిగృహంలో పాఠశాల నిర్వహణ కొనసాగుతోంది. నలుగురు ఉపాధ్యాయులతో పాటు 70 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

వెంటాడుతున్న భవనాల కొరత

మండల కేంద్రంలోని బిసి కాలనీలో ప్రాథమిక పాఠశాలకు రెండే తరగతి గదులున్నాయి. ఇక్కడ ఆరుగురు ఉపాధ్యాయులు, 122 మంది విద్యార్థులు ఉన్నారు. బోధించేందుకు ఉపాధ్యాయులు సరిపడా ఉన్నప్పటికీ అవసరమైన తరగతి గదులు లేవు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొమ్మిదేళ్ల కిందట ఆర్‌విఎం ఆధ్వర్యంలో రూ.7.30 లక్షలతో అదనపు భవనం నిర్మించినప్పటికీ నిరుపయోగంగా పడి ఉంది. ఇటీవల ఈ పాఠశాలలో నాడు-నేడు పనులు చేపట్టినప్పటికీ కొంతమేర నిధులు వీటికి ఉపయోగిస్తే బాగుండేదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. యు.వెంకంపేట ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకే భవనం కావడంతో విద్యాబోధన, వంటలు అందులోనే. చిట్టపూడివలస ప్రాథమిక పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులున్నా ఒకే భవనం ఉంది. ఇక్కడా విద్యాబోధనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పిల్లల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు కొంత మొత్తాలను పోగు చేసి అదనంగా రేకుల షెడ్డు నిర్మించారు. నాడు-నేడు పనులు త్వరగా పూర్తిచేసి, భవనాలను అందుబాటులోకి తేవాలని, అవసరమైన చోట అదనపు తరగతి గదులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

క్షయను తరిమేయాలి

ప్రజాశక్తి-సీతంపేట

పౌష్టికాహారంతో క్షయ వ్యాధిని తరిమేయాలని సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో క్షయ రోగులకు జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం కిట్లను ఆర్ట్స్ సంస్థ, రెడ్ క్రాస్ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ 60 మందికి కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ క్షయ వ్యాధితో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు ఆరు నెలలపాటు పౌష్టికాహారం అందించాలని ఉద్దేశంతో ఆదివాసీ ప్రాంతాల్లో చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకట్రావు, గౌరీశంకర్, చిన్నారావు, చైతన్య, మన్యం సహజ ఉత్పత్తుల కంపెనీ సిఇఒ బి.శంకరరావు, పద్మ, గౌతమి పాల్గొన్నారు


వినతి అందజేస్తున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు

ఆశాల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పాచిపెంట

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాచిపెంట పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.శోభారాణికి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన వినతి అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్‌ఆర్‌టిపి చండీప్రియ, జి.మంజుల, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం వద్ద మంగళవారం చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

దోమల నివారణకు పిచికారీ తప్పనిసరి

ప్రజాశక్తి-భామిని

వర్షాకాలం దృష్ట్యా దోమల నివారణకు గృహాలలో పిచికారీ తప్పనిసరని బాలేరు పిహెచ్‌సి వైద్యులు దీపికరాణి అన్నారు. భామిని మండలంలోని నల్లారాయిగూడలో బాలేరు పిహెచ్‌సి సిబ్బంది ఐఆర్‌ఎస్-2లో భాగంగా ఎసిఎం ద్రావణాన్ని ప్రతి ఇంటా పిచికారీ నిర్వహించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు, ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు, పంచాయతీ సెక్రటరీ ఎ.శంకర్, ఎఎన్‌ఎం భారతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-సీతంపేట

పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ కోరారు. సోమవారం టిడిపి మండల నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశక్తి, బిఎల్‌ఎ ఇంటిగ్రేట్ శిక్షణపై సూచనలు చేశారు. టిడిపి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి సీతంపేట మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, సవర సోడంగి, మండంగి ప్రకాశం, సవర సూర్యం, మండంగి మోహన్ కుమార్, సవర శంకర్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడి గ్రామంలో సేంద్రీయ పద్ధతిలో మీనామృతం తయారు చేయు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో చేపల వ్యర్థాలు, బెల్లంతో ఎలా తయారు చేసుకోవాలో చేసి చూపించారు. పంటలు అధిక దిగుబడితోపాటు ఎటువంటి చీడ తెగుళ్లు రాకుండా ఉంటాయని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, మాజీ సర్పంచ్ గురాన లక్ష్మి, యాంకర్ పర్సన్ లక్ష్మణ్ ఉన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్


బ్రహ్మకమల పుష్పం

పట్టణంలో రెండో వార్డులోని త్రినాథస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ అర్చకులు పద్మనాభ మహాపాత్రో మూడు ఏళ్ల కిందట బ్రహ్మకమలం మొక్కను నాటారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో బ్రహ్మకమలం పుష్పం వికసించింది. దీంతో పరిసర ప్రాంతమంతా సువాసన వెదజల్లింది. ఆ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో దేవస్థానానికి తరలివచ్చారు.

కె.శివడ, పెద్దగూడలో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి పంచాయతీ కె.శివడ, పెద్దగూడ గ్రామాలలో సోమవారం తాడికొండ పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫీవర్ స్క్రీనింగ్, కాలువల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారి నిర్వహించారు. గ్రామాల్లో ఆరోగ్య అలవాట్లపై హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీను, ఆరోగ్య సహాయకులు బి.లక్ష్మణరావు, ఎంఎల్‌హెచ్‌పిలు స్వాతి, దీపిక, తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండల పరిధిలోని సుమారు 10 గ్రామాల ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయం కల్పించేందుకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేసిన కృషి ఫలించింది. ఇటీవల గాదెలవలస, దయానిధిపురం, రంగంపేట, లక్ష్మీపురం గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామస్తులు చినభోగిలి కూడలి నుంచి ఏగోటివలస మీదుగా గాదెలవలస వరకు బిటి రహదారిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇచ్చిన హామీ మేరకు రహదారి మరమ్మతులను సోమవారం ఆయన ప్రారంభించారు. సుమారు 9.5 కిలోమీటర్ల బిటి రహదారి అభివృద్ధి పనులకు గాను పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల నుంచి ఎమ్మెల్యే రూ.1.96 కోట్లు మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జి, బలగ శ్రీరాములునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోల ఈశ్వరనారాయణ, మాజీ జెడ్‌పిటిసిలు అంబటి కృష్ణంనాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, సర్పంచులు వి.రాధాకృష్ణ, బి.భాస్కరరావు, బి.అన్నపూర్ణ, తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


రోడ్డు మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జగనన్న సురక్షతో మెరుగైన సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన సేవలు అందుతాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. పెదభోగిలిలో వాలంటీర్లు, గృహసారథులు, ఉద్యోగులకు జగనన్న సురక్షపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని, వాటిని జగనన్న సురక్ష యాప్‌లో రిజిష్టర్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తెరేజమ్మ, ఎంపిటిసి సభ్యులు బి.సూర్యనారాయణ, ఎస్.గౌరికిరణ్, పిఎసిఎస్ చైర్మన్ ఎస్.కూర్మారావు, స్టేట్ డైరెక్టరు ఎస్.తిరుపతిరావు, సీనియర్ నాయకులు ఆర్‌వి పార్థసారథి, రమేష్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పెదపెంకిలో గడపగడపకు

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే కనుక్కొని వాటి పరిష్కారానికి సైతం చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న పిఒ కల్పన కుమారి

స్పందనకు 97 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో పిఒ కల్పనకుమారి ఆధ్వర్యాన నిర్వహించిన స్పందనకు 97 వినతులు వచ్చాయి. రేగులగూడ కాలనీకి చెందిన సవర సింహాచలం తాగునీటి సమస్య పరిష్కరించాలని విన్నవించారు దొండమానుగూడకు చెందిన సూర్యం సిఆర్‌టి పోస్టు ఇప్పించాలని కోరారు. బాలేరుకు చెందిన భుజంగరావు ఆటో రుణం ఇప్పించాలని విన్నవించారు. పులిపుట్టికి చెందిన సవరతోట ముఖలింగం రేషన్ కార్డు రెన్యువల్ చేయాలని కోరారు. కార్యక్రమంలోని ఎపిఒ రోషిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం, సిడిపిఒ రామలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులపై దాడి



మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం. తిరుపతిరావు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

గిరిజన హక్కులు, రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర పాలకులు దాడి చేస్తున్నారని ఎపి గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఎపి గిరిజన సంఘం పాలకొండ మండల మహాసభ స్థానిక వాసవి తిరుమల కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్ర దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. జీడిపంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, సాగు చేసిన మొత్తానికి పోడు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకలతో ఇచ్చిన పట్టాలను సరిచేసి, మంజూరు చేయాలని కోరారు. పలు అంశాలపై తీర్మానం చేశారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా ఎస్.గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా పి.వాసు, ఉపాధ్యక్షులుగా వి.సింహాచలం, ఎ.ఒరియా, కార్యదర్శిగా ఎన్.సురేష్, చిన్నారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.అనూష, శాంతి, కోశాధికారిగా ఎస్.రమేష్ ఎన్నికయ్యారు.

డికెపట్నంలో జనసేన గ్రామబాట

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్


గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న జనసేన నాయకులు

మండలంలోని డికెపట్నంలో జనసేన మండల అధ్యక్షులు మణి ఆధ్వర్యాన గ్రామ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహన్ రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరు హాజరై, ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా రోడ్డు, తాగునీరు, రేషన్ కార్డులు, స్థానిక సమస్యలను జనసేన నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజలకు జనసేన నాయకులు హామీ ఇచ్చారు. డికెపట్నం నుండి బొడ్డవలస, టొంకి, గోచక్క గ్రామాలలో కాలినడకన ర్యాలీగా వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన బలిజిపేట మండల అధ్యక్షులు బి.పోలినాయుడు, జిల్లా నాయకులు కె.విశ్వేశ్వరరావు, చిట్లి గణేశ్వరరావు, కర్రి మణికంఠ, అల్లు రమేష్, సతీష్, పైల రాజు, గుంట్రెడ్డి గౌరీశంకర్, పాత్ర పవన్, అక్కేన భాస్కరరావు, అంబటి బలరాం, ఎ.దుర్గాప్రసాద్, సి సంతోష్, దుర్గా, కనకరాజు, పి.ప్రదీప్, కృపారావు, కేశవరావు, మహేష్, శివసాయి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం జిల్లా మహాసభ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఈ నెల 20, 21 తేదీల్లో కురుపాంలో జరిగే గిరిజన సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి కోరారు. సోమవారం పార్వతీపురం మండలం రంగాలగూడ, రావికోన, బట్టివలస గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులపై, చట్టాలపై దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని తిప్పికొట్టేందుకు మహాసభలో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.


గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ కద్రక రామస్వామి

కార్యక్రమంలో నాయకులు కుసుమూరు గంగన్న, కద్రక శంకర్రావు, ఇమ్మరిక బలరాం పాల్గొన్నారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ రామచంద్రరావు

ముగిసిన ప్రజావేదిక

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై గత పదిరోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీ సోమవారం ప్రజావేదికతో ముగిసింది. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2274 పనులకు రూ.14.73 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులపై ఎస్‌ఆర్‌పిలు ఎం.తిరుపతిరావు, ఎం.గోవింద ఆధ్వర్యంలో 23 పంచాయతీల్లో తనిఖీలు నిర్వహించారు. డ్వామా పీడీ కె.రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజావేదికలో గుర్తించిన సమస్యలను వివరించారు. అన్ని చోట్లా క్షేత్ర సహాయకుల రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, పలుచోట్ల కొలతలు వ్యత్యాసాలు గుర్తించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వివి శివరామప్ప, ఉపాధి హామీ అంబుడ్స్‌మేన్ కె.సన్యాసిరాజు, ఎపిడిలు శ్రీహరి, సురేష్‌నాయుడు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సుజాత, జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, ఎపిఒ పి.బావాజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ ఏరియా ఆసుపత్రి ఆవరణలో 108 సిబ్బందికి రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. ఇఎంటి సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా జిల్లా ఎఇఎంఎస్ మేనేజర్ ఎస్.మన్మథనాయుడు సమక్షంలో పాలకొండ డివిజన్ ఒఇ బి.విజయకుమార్ పర్యవేక్షణలో శిక్షణ సాగుతోంది. ఒజెటి అలుబిల్లి శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని దశమంతపురం గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జరపీడితులు, గర్భిణులు, రక్తహీనత తదితరమైన వ్యాధులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నయామి , 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై దశలవారీ ఆందోళన

ప్రజాశక్తి-సాలూరు



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ దశలవారీ పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.వెంకటరావు చెప్పారు. సోమవారం వారి ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 20 నుంచి దశలవారీ పోరాటానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. 20న మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా కార్మికులు, 21న పురుష కార్మికులతో రిలే నిరాహార దీక్షలు, 27న మున్సిపాలిటీలో పనులు నిలిపివేసి కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 తర్వాత నిరవధిక సమ్మెకు దిగనున్నామని చెప్పారు. ఆప్కోస్‌లో ఉన్న కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

కంటి వెలుగు కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారిని సోమవారం తగరపువలసలోని ఎన్‌ఆర్‌ఐ కంటి ఆస్పత్రికి తరలించారు. 40 మందిని శస్త్రచికిత్సలకు తరలించినట్లు కంటివెలుగు కార్యక్రమం జిల్లా అధికారి జి.నగేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు శైలజ, రోజా, మల్లిక పాల్గొన్నారు.


శస్త్ర చికిత్సలకు వెళ్తున్న వృద్ధులతో నేత్ర వైద్యాధికారి జి.నగేష్‌రెడ్డి